RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | బుధవారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 167 | మే 28, 2025 | వెల : రూ.3-00



చట్టాన్ని ఉల్లంఘిస్తే
కఠిన చర్యలు
4లో..

## చిలుక ప్రవీణ్ పై కేసు నమోదు చేయాలి

**వేద న్యూస్, హన్మకొండ :**

ప్రవక్త హజ్రత్ మహమ్మద్ సల్లల్లాహు వాఅలైహి వసల్లంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన యూట్యూబర్ జర్నలిస్ట్ చిలుక ప్రవీణ్ పై కేసు నమోదు చేయాలని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ 50వ డివిజన్ అధ్యక్షులు సయ్యద్ ఆఫ్సర్ పాషా డిమాండ్ చేశారు. మంగళవారం మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు.

చిలుక ప్రవీణ్ మహమ్మద్ ప్రవక్తపై చేసిన వ్యాఖ్యలు అనుచిత మైనవనీ, ప్రవీణ్ వాడిన భాషను సభ్య సమాజం అస్సహించుకుం టున్నదనీ అన్నారు. ప్రవీణ్ వ్యాఖ్యలు సమాజంలో మతసామరస్యానికి, శాంతికి భంగం కలిగించే విధంగా ఉన్నాయని అంతే గాక ముస్లిం సమాజం యొక్క మనోభావాలను గాయపర్చున్నాయని పేర్కొన్నారు. ఇస్లాంను అవమాన పరిచిన చిలుక ప్రవీణ్‌పై కఠిన చర్యలు తీసుకో వాలని వీలైతే గ్రేష్ దేశ ద్రోహులుగా పిలవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మొహమ్మద్ బషీర్, మొహమ్మద్ మజీద్ మిర్జా, మహమ్మద్ ఫయాజ్, మహమ్మద్ ఇర్ఫాన్, సయ్యద్ అఫ్జల్ పర్వీజ్, మొహమ్మద్ అబ్దుల్ రెహమాన్, సయ్యద్ అజరుద్దీన్, మొహమ్మద్ అప్సర పాషా, కే.జి.న్. ఫంక్షన్ హాల్ సయ్యద్ ఖాలీద్ పాషా, మహమ్మద్ ఫెరోజ్, మొహమ్మద్ సాహెబ్, మహమ్మద్ అక్రమ్, మొహమ్మద్ షాకీర్ పలువురు పాల్గొన్నారు.

దూరదర్శన్ ఆట-పాట సీజన్-2కు

## ఎంపికైన జానపద గాయని మౌనిక

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**



నల్లగొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన ఆదిమల్ల మౌనిక సంజీవ దూరం దర్శన్ యాదగిరి ఛానల్‌లో బుధవారం నుండి ప్రారంభమయ్యే ఆటపాట ఎపిసోడ్‌కు ఎంపికయ్యారు. డిగ్రీ పూర్తి చేసుకొని జానపద రంగంలో పీజీ చేస్తున్న మౌనిక కళలపై తనకున్న మక్కువతో తెలంగాణ జానపద గాయనిగా, వివిధ ఈవెంట్లో సినిమా పాటలు ఆలపిస్తూ మంచి గాయనిగా రాణిస్తూ ఉంది. ప్రస్తుతం మౌనిక సంజీవ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో జానపద రంగంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదువుతూ, టీవీలలో వచ్చే వివిధ ప్రోగ్రాములలో తన నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ ఉంది.గతంలో మధుప్రియ నిర్వహించిన బతుకుబాట ప్రోగ్రాంలో కూడా సెలెక్ట్ అయి మంచి గాయనిగా గుర్తింపు పొందింది.ఈ సందర్భంగా మౌనిక మాట్లాడుతూ భవిష్యత్తులో ఒక మంచి సింగర్‌గా గుర్తింపు పొందాలనే లక్ష్యంతో ముందుకు పోతున్నట్లు తెలిపా రు. దూరదర్శన్ ఆటపాట కార్యక్రమంలో సెలెక్ట్ అయినందుకు తెలంగాణ ఉద్యమ కళాకారులు మరియు మిర్యాలగూడ కళావేదిక సభ్యులు మౌనికను అభినందించారు.



# గట్టి బదులు ఇస్తాం..

- 22 నిమిషాల్లో 9 "ఉగ్ర" స్థావరాలు ధ్వంసం
- భారత్ పై ఉగ్రవాదుల దాడి వ్యూహాత్మకమే
- ఉగ్రవాదం పాక్ యుద్ధ వ్యూహం
- భారత ప్రధాని నరేంద్ర మోదీ

**వేద న్యూస్, డెస్క్:**

ఆపరేషన్ సిందూర్‌లో హతమైన ముష్కరుల అంత్యక్రియలను పాక్ ప్రభుత్వం అధికార లాంఛనాలతో నిర్వహించిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఉగ్రవాదుల శవపేటికలపై పాక్ జాతీయజెండా కప్పటంతోపాటు సైన్యం సెల్యూట్ చేసినట్లు తెలిపారు. అందువల్ల పాక్ భూభాగం నుంచి జరుగుతున్న ఉగ్రవాదుల దాడులు పక్కా పథకం ప్రకారం వ్యూహాత్మకంగా చేస్తున్న యుద్ధమని ప్రధాని మోదీ ఆరోపించారు. గుజరాత్ పర్యటనలో భాగంగా గాంధీనగర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు.పాకిస్థాన్ ఆచరిస్తున్న ఉగ్రవాదం ఉద్దేశపూర్వక యుద్ధ వ్యూహమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. భారత్ ఆ వ్యూహాన్ని తిప్పికొట్టడానికి గట్టిగా బదులిస్తుందని స్పష్టం చేసారు. ఉగ్రవాదాన్ని ఇప్పటివరకు పరోక్షయుద్ధం అనేవారం. మే 6తర్వాత నాటి దృశ్యాలు చూసిన తర్వాత దీన్ని పరోక్షయుద్ధం కాదని అర్థమైందన్నారు. అందుకు కారణం ఉంది. ఉగ్రవాదుల 9 స్థావరాలను గుర్తించి కేవలం 22 నిమిషాల్లో ధ్వంసం చేయటం జరిగిందని తెలిపారు. ఈ సారి కెమెరాలు కూడా ఏర్పాటు చేయటం జరిగింది. ఎందుకంటే మనవారే ఎవరైన సాక్ష్యం అడిగితే ఇవ్వటానికి. ఇప్పుడు మనం సాక్ష్యాలు ఇవ్వాల్సిన అవసరం లేకుండా అక్కడివారే ఇస్తున్నారు అని ప్రధాని మోదీ అన్నారు. 1947లో భారత్ ను మూడు ముక్కలుగా చేశారు. అదే రోజు రాత్రి కశ్మీర్ పై మొదటి ఉగ్రవాద దాడి జరిగింది. ఉగ్రవాదుల సాయంతోనే కశ్మీర్లోని కొంత భాగాన్ని పాకిస్థాన్ స్వాధీనం చేసుకుంది. సర్దార్ పటేల్ సలహాలను అంగీకరించి, ఆ రోజే ఉగ్రవాదలను చంపి ఉంటే భారత్లో గత 75 సంవత్సరాలుగా కొనసాగుతున్న ఉగ్రవాద కార్యకలాపాలు ఉండేవి కాదు. శరీర ఆరోగ్యం ఎంత బాగున్నా ఒక ముళ్లు గుచ్చుకుంటే చాలు ఎప్పుడూ నొప్పి కలుగుతూనే ఉంటుంది. మేం ఆ ముళ్లను తొలగించాలని నిర్ణయించుకున్నాం అని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. అంతకుముందు ప్రధాని నరేంద్రమోదీ గాంధీనగర్‌లో భారీ రోడ్‌షో నిర్వహించారు.

ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావటంతో ప్రధానిని అభినం దించేందుకు ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. రాజ్‌భవన్ నుంచి ప్రారంభమైన రోడ్‌షో మహాత్మామందిర్ వరకు సాగింది. రోడ్డు పొడవునా వేలాదిగా బారులుతీరున ప్రజలు త్రివర్ణ పతకాలతో ప్రధానికి స్వాగతం పలికారు. రెండ్రోజుల గుజరాత్ పర్యటనలో భాగంగా గాంధీనగర్‌లో చేపట్టిన రోడ్‌షో నాల్గోది. గతనెల 22న జరిగిన పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా సైన్యం నిర్వహించిన ఆపరేషన్ సిందూర్ సక్సెస్ తర్వాత తొలిసారి సొంతరాష్ట్రానికి వెళ్లిన ప్రధాని మోదీకి ప్రజలు బ్రహ్మరథం పట్టారు.



## క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయి

- సిఐ సత్యనారాయణ

**వేద న్యూస్, హన్మకొండ :**

క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని సుబేదారి సర్కిల్ ఇన్స్పెక్టర్ పి.సత్యనారాయణ రెడ్డి అన్నారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి,తనయుడు స్వర్గీయ నాయిని విశాల్ పేరిట ప్రతి ఏటా నిర్వహించే క్రికెట్ పోటీలలో భాగంగా మంగళవారం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో నాయిని యువసేన ఆధ్వర్యంలో జరుగుతున్న క్రికెట్ మ్యాచ్‌కు సీఐ పి.సత్యనారాయణ రెడ్డి హాజరై టాస్ వేసి మ్యాచ్‌ను ప్రారంభించారు.ఈ సందర్భంగా సుబేదారి సిఐ సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ.. క్రీడలు శరీర దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. చిన్నతనం నుంచే క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చునని తెలిపారు. క్రీడా పోటీల్లో ప్రతి ఒక్కరూ గెలుపు ఓటములను పట్టించుకోకుండా క్రీడా స్ఫూర్తిని చాటాలన్నారు. క్రీడల్లో ముందుకు సాగాలంటే సాధననే ముఖ్యమని తెలిపారు. యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా మంచి మార్గంలో ప్రయాణించి తల్లిదండ్రులు గర్వించే విధంగా ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆటగాళ్లతో పాటు నిర్వాహకులు, నాయిని యువసేన టీం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



## భూ సర్వేలో సర్వేయర్ల పాత్ర కీలకం

- కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వేద న్యూస్, వరంగల్ :**

భూముల సర్వేలో సర్వేయర్ల పాత్ర చాలా కీలకమైనదని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. మంగళవారం వరంగల్ దేశాయిపేట లోని సికెఎం కళాశాలలో లైసెన్స్ సర్వేయర్‌లకు సర్వే సెటిల్‌మెంట్, భూ రికార్డుల శాఖ ద్వారా నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

రాష్ట్ర ప్రభుత్వం భూ సమస్యలు పరిష్కారం కోసం ఏప్రిల్ 14న అంబేడ్కర్ జయంతి రోజు భూ భారతి చట్టాన్ని అమల్లోకి తెచ్చిందన్నారు. ఈ చట్టం అమలులో భాగంగా గ్రామాల్లో రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసేందుకు రాష్ట్రంలో 6 వేల మంది లైసెన్స్‌డ్ సర్వేయర్‌లను నియమించనున్నట్లు తెలిపారు. అందులో భాగంగా నోటిఫికేషన్ జారీ చేసి, వారిని ఎంపిక చేసినట్లు చెప్పారు. జిల్లాలో 315 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్‌లకు సోమవారం నుంచి 50 రోజుల పాటు శిక్షణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వారికి అనుభజ్ఞులైన రిటైర్డ్ సర్వేయర్లు థియరీతో పాటు ప్రాక్టికల్‌గా శిక్షణ ఇస్తారన్నారు. శిక్షణ అనంతరం పరీక్ష ఉంటుందని, అందులో ఉత్తీర్ణులైన వారినే సర్వేయర్లుగా నియమిస్తామన్నారు. ప్రభుత్వ భూముల సర్వే, అసైన్డ్ భూముల సర్వే ప్రాజెక్టుల సందర్భంగా భూసేకరణకు సంబంధించిన సర్వే ఎఫ్ లైన్ వంటి సర్వేల సమయంలో సర్వేయర్లు ముఖ్య పాత్ర పోషించాల్సి ఉంటుందన్నారు. ప్రత్యేకించి రెవెన్యూకు చెందిన గ్రామాలు, మండలాల అంతర్గత సరిహద్దుల వివాదాల పరిష్కారం కోసం నిర్వహించే సర్వే విషయంలో సర్వేయర్లు చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు.ఏమైనా సందేహాలుంటే నివృత్తి చేసుకోవాలని అన్నారు. లైసెన్స్‌డ్ సర్వేయర్‌లు చేసిన భూ సర్వేను ప్రభుత్వ సర్వేయర్‌లు పరిశీలన చేసి, మ్యాప్ రూపొందిస్తారని కలెక్టర్ అన్నారు. భూ భారతి చట్టం అమలు కోసం ఎంపిక చేసిన లైసెన్స్‌డ్ సర్వేయర్లు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అభ్యర్థులకు శిక్షణ మెటీరియల్ కిట్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా రెవెన్యూ అధికారి విజయలక్ష్మి, జిల్లా ల్యాండ్ సర్వే అధికారి దేవరాజు, డిప్యూటీ ఇన్స్పెక్టర్ నాగభూషణం, తహసీల్దార్ మహ్మద్ ఇక్బాల్, పర్యవేక్షకులు అబూతల్హా, డిప్యూటీ సర్వేయర్ ప్రభాకర్ కళాశాల ప్రిన్సిపాల్ ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## నేడు, రేపు భారీ వర్షాలు..

**వేద న్యూస్, డెస్క్:**

వర్షాకాలం ముందే వచ్చేసింది. రాబోయే రెండు రోజుల్లో భారీ వర్షాలు కురవనున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. అలాగే పలు జిల్లాలకు అధికారులు ఆరెంజ్, ఎల్లో అలెర్ట్ జారీ చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు సూచిస్తున్నారు. నైరుతి రుతుపవనాలు దక్షిణ తెలంగాణలోకి విస్తరించాయి. ఉత్తర బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. ఈ కారణంగా నేడు, రేపు తెలంగాణలో భారీ వర్షాలు కురవను న్నాయని వాతావరణ శాఖ ప్రకటించింది. గంటకు 40-50 కి.మీ వేగంతో ఈదురు గాలులు వీస్తాయి. భారీ వర్షాల నేపథ్యంలో బుధవారం తెలంగాణలోని 4 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్, 14 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. తెలంగాణలోని పలు జిల్లాల్లో బుధ, గురువారాల్లో 40 నుంచి 50 కిలో మీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. దీంతో రాబోవు రెండు, మూడు రోజులు గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 5 నుంచి 7 డిగ్రీలు తక్కువగా నమోదయ్యే అవకాశం ఉంది. భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. పొలాలకు వెళ్లే రైతులు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

# అన్నదానంతో ఆకలి తీర్చడం అభినందనీయం - వెంపటి రవితేజ

**వేద న్యూస్, సూర్యాపేట ప్రతినిధి:**

సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయం వద్ద మంగళవారం అమావాస్య తిథి సందర్భంగా వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ వీ104ఏ రీజియన్ -6 సూర్యాపేట వాసవి యూత్ క్లబ్ అధ్యక్షులు వెంపటి రవితేజ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అన్నదానంతో పేదల, బాటసారుల ఆకలి తీర్చడం అభినందనీయమని అన్నారు. అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పదని అన్నారు. గత కొన్నేళ్లుగా అమావాస్య తిథి రోజున అన్నదాన కార్యక్రమాన్ని దాతల సహకారంతో విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ సమాజ సేవలో భాగస్వాములు కావాలని అన్నారు. అన్నదాన కార్యక్రమానికి సహకరిస్తున్న దాతలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రీజియన్ చైర్మన్ గుమ్మడివెల్లి శ్యాంసుందర్, రీజియన్ సెక్రటరీ యమా సంతోష్, ఐఈసీ శింగిరికొండ రవీందర్, క్యాబినెట్ సెక్రటరీ బిక్కుమల్ల కృష్ణ, క్యాబినెట్ ట్రెజరర్ వెంపటి శబరినాథ్, ఐపీసీలు పబ్బతి వేణుమాధవ్, రాచకొండ శ్రీనివాస్, జడ్సీ మాడుగుల మణికంఠ, భానుపురి సేవా బృందం శ్రీరంగం రాము, డిస్ట్రిక్ ఆఫీసర్ జూలకంటి నాగరాజు, దాతలు యామా సుధాకర్ అరుణ, యామా ఉమా, తల్లాడ అశోక్, కందగట్ల రామకృష్ణ, రుద్రంగి శ్రీనివాస్, చందా వెంకన్న, కందిబండ సూరయ్య, వెంకన్న, రతన్ తదితరులు పాల్గొన్నారు.



# పాకిస్థాన్, చైనా నుంచి ముప్పు..

**వేద న్యూస్, డెస్క్:**

2025 వరల్డ్ థ్రెట్ అసెస్‌మెంట్ అనే పేరుతో ఇటీవల విడుదలైన యుఎస్ ఇంటెలిజెన్స్ నివేదిక ఇండియాకు డేంజర్ బెల్స్ మోగించింది. చైనా, పాకిస్తాన్ నుంచి ఇండియాకు ముప్పు పొంచి ఉందని నివేదిక పేర్కొంది. భారత్ ఎదుర్కొంటున్న రెండు ముఖ్యమైన భద్రతా సవాళ్లను కూడా ప్రస్తావించింది. చైనా, పాక్.. భారత్‌కు వ్యతిరేకంగా తమ సైనిక సామర్థ్యాలను ఆధునీకరించడానికి, విస్తరించడానికి చేస్తున్న ప్రయత్నాలను నొక్కి చెబుతుంది. ఆపరేషన్ సిందూర్ తర్వాత వచ్చిన ఈ నివేదిక భారత్ అభివృద్ధి చెందుతున్న రక్షణ వైఖరిని అంచనా వేస్తుంది. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారత్ ప్రపంచ స్థాయిని బలోపేతం చేయడం, దాని సైనిక బలాన్ని బలోపేతం చేయడం, చైనా పెరుగుతున్న ప్రభావాన్ని ఎదుర్కోవడంపై దృష్టి పెట్టే అవకాశం ఉందని ఇది పేర్కొంది. భారత్ చైనాను తన ప్రాథమిక వ్యూహాత్మక ప్రత్యర్థిగా చూస్తుండగా, మే మధ్యలో ఇటీవల సరిహద్దు శత్రుత్వాలు ఉన్నప్పటికీ, పాకిస్తాన్‌ను నిరంతర శత్రువుగా చూస్తున్నారని నివేదిక పేర్కొంది.

**- పాకిస్తాన్ సైనిక ఆధునీకరణ**

సరిహద్దు ఉద్రిక్తతలను నిర్వహించడం, తెహ్రిక్-ఇ తాలిబన్ పాకిస్తాన్, బలూచ్ తిరుగుబాటుదారుల వంటి సమూహాల నుండి దేశీయ ఉగ్రవాద ముప్పులను ఎదుర్కోవడం, దాని అణ్వాయుధ సామర్థ్యాలను అభివృద్ధి చేయడం వంటి రాబోయే సంవత్సరంలో పాకిస్తాన్ కీలకమైన రక్షణ ప్రాధాన్యతలను ఈ అంచనా వివరిస్తుంది. 2024లో మాత్రమే ఉగ్రవాద దాడుల వల్ల పాకిస్తాన్ అంతటా 2,500 మందికి పైగా మరణించారు. పాకిస్తాన్ భారతదేశాన్ని ఒక ప్రాథమిక ముప్పుగా చూస్తూనే ఉంది. అందువల్ల భారత్‌ను ఎదుర్కోవడానికి వ్యూహాత్మక అణ్వాయుధాల అభివృద్ధితో సహా దాని అణ్వాయుధ వ్యూహాన్ని మెరుగుపరచడానికి ప్రయత్నాలను ముమ్మరం చేస్తోంది. ప్రధానంగా చైనా, యూఏఈ, టర్కీ, హాంకాంగ్, సింగపూర్ వంటి ఇతర మధ్యవర్తిత్వ దేశాలతో అనుసంధానించబడిన నెట్‌వర్క్‌ల ద్వారా పాకిస్తాన్ సున్నితమైన పదార్థాలు, సాంకేతికతను పొందడం గురించి ఆందోళనలను కూడా ఈ నివేదిక హైలైట్ చేస్తుంది.

**- చైనా..**



ఈ నివేదిక చైనా ఏం చేస్తుందో కూడా స్పష్టం చేసింది. ఆ దేశం అమెరికాకు అత్యంత సమగ్రమైన సైనిక ముప్పుగా అభివర్ణిస్తుంది. చైనా తన సైన్యాన్ని భూమి, వాయు, సముద్రం, సైబర్, అంతరిక్షం వంటి అన్ని రంగాలలో వేగంగా అప్‌గ్రేడ్ చేస్తోంది. తూర్పు ఆసియాలో ఆధిపత్యాన్ని సాధించడం, తైవాన్‌ను ప్రధాన భూభాగంతో ఏకం చేయడం, ప్రపంచ స్థాయిలో అమెరికాను సవాలు చేయడం బీజింగ్ లక్ష్యం అని నివేదిక సూచిస్తుంది. చైనా అణ్వాయుధాల నిల్వలు 600 ఆపరేషనల్ వార్‌హెడ్‌లను అధిగమించాయని అంచనా వేసింది. 2030 నాటికి 1,000 దాటుతుందని అంచనా. ఉపగ్రహ, నిఘా వ్యవస్థలలో అమెరికా ఆధిపత్యాన్ని దెబ్బతీసేందుకు ఆ దేశం అంతరిక్ష ఆధారిత సాంకేతిక పరిజ్ఞానాలలో కూడా భారీగా పెట్టుబడులు పెడుతోంది. చైనా, పాకిస్తాన్ రెండూ కీలకమైన భౌగోళిక రాజకీయ ఘర్షణ కేంద్రాలుగా కొనసాగుతున్నాయని, రాబోయే సంవత్సరాల్లో ప్రాంతీయ, ప్రపంచ భద్రతా గతిశీలతను గణనీయంగా రూపొందిస్తాయని నివేదిక తేల్చింది.



# అమెరికాలో విజృంభిస్తున్న కరోనా మహమ్మారి

**వేద న్యూస్, డెస్క్:**

కరోనా రీఎంట్రీ కలకలం రేపుతోంది. అది కొత్త రూపంలో పంజా విసురుతోంది. ప్రపంచ వ్యాప్తంగా కొవిడ్ కేసులు పెరుగుతున్నాయి. ఇటు భారత్ పాటు అమెరికాలో కోవిడ్ -19 కేసులు పెరుగుతున్నాయి. అమెరికాలో కరోనా ధాటికి గత వారం రోజుల్లో వందలాది మందిని ప్రాణాలు కోల్పోయారు. ప్రస్తుతం పరిస్థితి మునుపటిలా దారుణంగా లేనప్పటికీ, కరోనా పూర్తిగా పోలేదని ఖచ్చితంగా స్పష్టమైంది. గత కొన్ని వారాలుగా మన దేశంలోని వివిధ ప్రాంతాల నుండి కరోనా కేసులు నమోదవుతున్నాయి.

కొవిడ్-19 మళ్లీ డేంజర్‌బెల్స్ మోగిస్తోంది. దేశవ్యాప్తంగా వందలాది కరోనా కేసులు నమోదవుతున్నాయి. కేరళలో 430కి పెరిగిన యాక్టివ్ కేసులు. మహారాష్ట్రలో 209, ఢిల్లీలో 104, గుజరాత్‌లో 83.. తమిళనాడులో 69, కర్నాటకలో 47, ఉత్తరప్రదేశ్‌లో 15, పశ్చిమ బెంగాల్‌లో 11 యాక్టివ్ కేసులు ఉన్నట్లు కేంద్ర వైద్యారోగ్య శాఖ తెలిపింది. ఇటు తెలుగు రాష్ట్రాల్లోని పలు జిల్లాల్లో కరోనా కేసులు నమోదు అవుతుండగా.. నోయిడాలో 9 కరోనా కేసులు రికార్డ్ అయ్యాయి. గణాంకాలే కాదు, కరోనా మరణాలు కూడా మరోసారి భయాన్ని పెంచాయి. ఇప్పటివరకు 7 మంది మహమ్మారి బారిన పడి ప్రాణాలు కోల్పోయారు. అయితే వారి మరణానికి కారణం కరోనా లేదా మరేదైనా వ్యాధి కాదా అనేది స్పష్టంగా లేదు. దేశంలో కరోనా కేసులు పెరుగుతుండడంతో అన్ని రాష్ట్రాలను కేంద్రం అలర్ట్ చేసింది. ముందు జాగ్రత్తగా ఆస్పత్రులు సిద్ధం చేయాలని ఆదేశించింది. అయితే.. ఆయా రాష్ట్రాల్లోని కరోనా బాధితులకు స్వల్ప లక్షణాలు మాత్రమే ఉన్నాయని కేంద్ర ఆరోగ్యశాఖ ప్రకటించింది. బాధితుల్లో ఎక్కువమంది ఇంట్లోనే చికిత్స తీసుకుంటున్నట్లు తెలిపింది. భయపడాల్సిన అవసరం లేదని సూచించింది. అదేవిధంగా, థాయిలాండ్‌లో పరిస్థితి మరింత దిగజారుతున్నట్లు కనిపిస్తోంది, ఇక్కడ కేవలం ఒక వారంలోనే 50 వేలకు పైగా కొత్త కరోనా కేసులు నమోదయ్యాయి. మరోవైపు, అమెరికాలో కరోనా ఇప్పటికీ ప్రాణాలను బలిగొంటోంది. గత వారం 350 మంది అమెరికన్లు కోవిడ్-19 కారణంగా మరణించారని సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ తెలిపింది. ఈ సంఖ్య మునుపటి కంటే తక్కువగా ఉంది. కానీ ఆందోళన కొనసాగుతోంది.. 1.8.1 అనే కొత్త సబ్-వేరియంట్ అమెరికా, సింగపూర్, హాంకాంగ్‌లతో సహా ఆసియాలో విస్తరిస్తోంది. శాస్త్రవేత్తల ప్రకారం, ఈ వైవిధ్యమైన వైరస్ వేగంగా వ్యాపిస్తుంది. అయినప్పటికీ దాని తీవ్రత గురించి పరిశోధనలు ఇంకా కొనసాగుతున్నాయి. అమెరికాలో కేవలం 23% పెద్దలు మాత్రమే బుస్టర్ డోస్ వ్యాక్సిన్ తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. పిల్లలలో ఈ సంఖ్య ఇంకా తక్కువగా ఉంది. కేవలం 13% మాత్రమే. టీకాలు వేయకపోవడం, కాలక్రమేణా రోగనిరోధక శక్తి బలహీనపడటం రెండూ ఈ పెరుగుదలకు కారణమవుతున్నాయని నిపుణులు అంటున్నారు. వృద్ధులు, ఇప్పటికే అనారోగ్యంతో ఉన్నవారిపై ఈ వైరస్ ఎక్కువ ప్రభావం చూపుతోంది. అందువల్ల, 65 ఏళ్లు పైబడిన వారు ప్రతి ఆరు నెలలకు రెండు డోసుల వ్యాక్సిన్ తీసుకోవాలని సూచించారు. మరో ప్రధాన కారణం ఏమిటంటే, పరిస్థితి మరింత దిగజారే వరకు ప్రజలు చికిత్స తీసుకోకపోవడమే అంటున్నారు నిపుణులు. మోల్నుపిరవిర్ (మెర్క్), పాక్లోవిడ్ (ఫైజర్) వంటి యాంటీవైరల్ మాత్రలు లో అందుబాటులో ఉన్నాయి, వీటిని లక్షణాలు ప్రారంభమైన ఐదు రోజుల్లోపు తీసుకోవచ్చు. కానీ చాలా మంది వాటిని సరైన సమయంలో ఉపయోగించరు. సకాలంలో పరీక్షలు, మందులతో తీవ్రమైన ఇన్ఫెక్షన్లను నివారించవచ్చని వైద్యులు అంటున్నారు.

# మోదీ ఎదుగుదలను జీర్ణించుకోలేక పోతున్నారు



**వేద న్యూస్, హైదరాబాద్:**

మోదీ పాలనలో న్యాయవ్యవస్థ బలోపేతం అయిందని బీజేపీ రాజ్యసభ సభ్యులు డాక్టర్ లక్ష్మణ్ ఉద్ఘాటించారు. కాంగ్రెస్ హయాంలో దేశం ఎకానమీలో పదోస్థానంలో ఉండేదని.. మోదీ పాలనలో 4వ అతిపెద్ద ఎకానమీ దేశంగా ఎదిగిందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ మూడుసార్లు ఎన్నికల్లో ఓడిపోయిందని.. అయినా ప్రధానిగా మోదీ ఎదుగుదలను జీర్ణించుకోలేక పోతున్నారని మండిపడ్డారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడమనేది తెలంగాణ ప్రజలకు జరిగిన అవమానంగా చూడాలని తెలిపారు లక్ష్మణ్. గతంలో అంజయ్యకు అవమానం జరిగిందని.. ఇప్పుడు రేవంత్‌రెడ్డికి జరుగుతుందని లక్ష్మణ్ గుర్తుచేశారు. ఇవాళ (మంగళవారం) హైదరాబాద్‌లోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో లక్ష్మణ్ మీడియాతో మాట్లాడారు. మావోయిస్టులు ఆయుధాలు వదిలి జనజీవన స్రవంతిలో కలిస్తే చర్చలు ఉంటాయని స్పష్టం చేశారు. కొంతమంది ఆపరేషన్ సిందూర్‌ను, ఆర్మీని అవమానించడాన్ని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. కుటుంబ కలహాలు, ఆర్థిక సమస్యల నేపథ్యంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత లేఖ రాసిందని తెలుస్తోందని అన్నారు లక్ష్మణ్.

గత కేసీఆర్ ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా ఈటల రాజేందర్ నోటీసులకు సమాధానం ఇస్తారని లక్ష్మణ్ చెప్పుకొచ్చారు. మల్లికార్జున ఖర్గే 11 ఏళ్ల మోదీ పాలనను పీడకలగా చెప్పడం సరికాదని అన్నారు. ఎమర్జెన్సీని తెచ్చింది కాంగ్రెస్ పార్టీ అది ఓ పీడకల అని విమర్శించారు. ఓబీసీ రిజర్వేషన్‌ను అడుగు అడుగునా అడ్డుకుంది ప్రతిపక్షనేత రాహుల్ గాంధీనే అని విమర్శించారు. కాంగ్రెస్ 50 ఏళ్ల పాలనలో చేయలేనిది మోదీ 11 ఏళ్లలో చేశారని అన్నారు. యువతకు ఉద్యోగాలు కల్పించడంలో దేశం అగ్రస్థానంలో ఉందని లక్ష్మణ్ చెప్పారు.

# కొడాలి నాని ఆరోగ్యంపై ఆందోళన

**వేద న్యూస్, గుడివాడ :**



మాజీ మంత్రి కొడాలి నానికి ఇటీవల సర్జరీ జరిగింది. ఈ నేపథ్యంలో ఎక్కువ మంది కలిస్తే.. ఆయనకు ఇన్ఫెక్షన్ వచ్చే అవకాశముందని కొడాలి నాని కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. కొడాలి నాని కుటుంబ సభ్యుల విజ్ఞప్తిని దృష్టిలో ఉంచుకొని వైసీపీ శ్రేణులు, అభిమానులు దయ చేసి ఆయనను కలిసేందుకు హైదరాబాద్ రావద్దని వైసీపీ నేత దుక్కిపాటి శశిభూషణ్ పేర్కొన్నారు. ఇటీవల హైదరాబాద్‌లో సన్నిహిత మిత్రుడు కుమారుడి రిసెప్షన్‌కు కొడాలి నాని తప్పని పరిస్థితుల్లో పాల్గొనడం జరిగిందని ఆయన వివరణ ఇచ్చారు. డాక్టర్ల సూచనల మేరకు కోవిడ్ దృష్ట్యా.. సర్జరీ తరువాత కొడాలి నానికి ఇన్ఫెక్షన్ వచ్చే ప్రమాదం ఉన్నందున దయ చేసి పార్టీ శ్రేణులు, అభిమానులు ఆయనను కలిసేందుకు హైదరాబాద్ రావద్దని కోరారు. మరో రెండు నెలల్లో కొడాలి నాని పార్టీ శ్రేణులతోపాటు అభిమానులకు అందుబాటులో ఉంటారని వైసీపీ నేత శశి భూషణ్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ మేరకు వైసీపీ నేత దుక్కిపాటి శశిభూషణ్ పేరుతో మంగళవారం పత్రిక ప్రకటన వెలువడింది.

మరోవైపు కొడాలి నాని ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురైయ్యారు. ఆయనకు హైదరాబాద్‌లో ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్య చికిత్స కోసం ముంబై తరలించిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత ఆయన ఎప్పుడు హైదరాబాద్ తిరిగి వచ్చారో తెలియదు. అయితే ఇటీవల ఓ ఫంక్షన్‌కు కొడాలి నాని హాజరైనట్లు సోషల్ మీడియాలో ఫొటోలు వైరల్ అయినాయి. ఈ నేపథ్యంలో కొడాలి నాని ఆరోగ్య పరిస్థితి కుదుటపడిందంటూ గుడివాడ నియోజకవర్గంలో ఒక చర్చ అయితే సాగుతోంది. ఈ నేపథ్యంలో కొడాలి నానిని పరామర్శించేందుకు నియోజకవర్గంలోని ఆయన అభిమానులు హైదరాబాద్ తరలి వస్తున్నారు. ఈ నేపథ్యంలో కొడాలి నాని సన్నిహితుడు, వైసీపీ నేత దుక్కిపాటి శశిభూషణ్ ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు.

# ఒకే కుటుంబంలోని ఏడుగురు అనుమానాస్పద మృతి

**వేద న్యూస్, డెస్క్:**

కారులో ఒకే కుటుంబంలోని ఏడుగురు అనుమానాస్పదంగా మృతిచెందారు. ఈ విషాదకర సంఘటన హర్యానాలోని పంచకుల జిల్లాలో చోటుచేసుకుంది. డెహ్రాడూన్‌కు చెందిన ఒక కుటుంబం కారులో ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పంచకులలోని సెక్టార్ 27లోని ఓ ఇంటి వద్ద రోడ్డుపై ఆపి ఉన్న కారులో ఏడుగురు చనిపోయినట్లు గమనించిన స్థానికులు వెంటనేయ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సంఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు ఏడుగురు మృతదేహాలను పంచకులలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మరణించిన వ్యక్తిని డెహ్రాడూన్‌కు చెందిన ప్రవీణ్ మిట్టల్(42)గా గుర్తించారు. అతనితో పాటు అతని తల్లిదండ్రులు, భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. సంఘటన స్థలం నుండి పోలీసులు సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకున్నారు. అప్పులు, తీవ్ర ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆ కుటుంబం కారులో విషం తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. సంఘటన గురించి సమాచారం అందుకున్న పంచకుల డిసిపి హిమాద్రి కౌశిక్, డిసిపి (శాంతిభద్రతలు) అమిత్ దహియా సంఘటనా స్థలానికి చేరుకుని సమగ్ర దర్యాప్తు ప్రారంభించారు.

# లివర్‌పూల్ పరేడ్‌లో విషాదం.. అభిమానుల మీదకు దూసుకెళ్లిన కారు

**వేద న్యూస్, డెస్క్:**



లండన్‌లో ప్రీమియర్ లీగ్ ఛాంపియన్‌షిప్‌ను జరుపుకుంటున్న లివర్‌పూల్ సాకర్ విక్టరీ పరేడ్ లో విషాదం చోటుచేసుకుంది. పరేడ్ లో భారీగా పాల్గొన్న అభిమానుల సమూహంపైకి ఓ కారు దూసుకెళ్లింది. గుంపుపైకి దూసుకెళ్లిన కారు కొంత దూరం వరకు జనాన్ని ఢీకొట్టుకుంటూ వెళ్లింది. దీంతో దాదాపు 47 మంది గాయపడ్డారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు కారు డ్రైవర్ ను అదుపులోకి తీసుకున్నారు. అత్యవస చికిత్స కోసం ఎయిర్ అంబులెన్స్, ఇతర అత్యవసర వాహనాలు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదంలో నలుగురు పిల్లలు సహా ఇరవై ఏడు మందిని ఆసుపత్రికి తరలించారు. ఇద్దరు తీవ్ర గాయాలతో బయటపడ్డారని అధికారులు తెలిపారు. మరో 20 మందికి సంఘటన స్థలంలోనే చికిత్స అందించినట్లు చెప్పారు. ఈ సంఘటనకు కారణం డ్రైవర్ మాత్రమేనని.. ఉగ్రవాద చర్యగా దర్యాప్తు చేయడం లేదని అధికారులు తెలిపారు.

# సంపాదకీయం

## ప్రమాదంలో న్యాయవ్యవస్థ

దేశంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యం చాలా బలహీనపడింది. ప్రజల ప్రాతినిధ్యం అంతకంతకూ నామమాత్రంగా మారిపోయింది. అధ్యక్ష తరహా పాలనను బీజేపీ కోరుతున్నదంటే అది నియంతృత్వం నెలకొల్పటానికే. దాని రాజకీయ దృక్పథం సమానత్వానికి, సమాన అవకాశాలకు, సామాజిక న్యాయానికి వ్యతిరేకం. అధికారాన్ని అడ్డం పెట్టుకుని గత పదకొండేండ్లుగా రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తూ వస్తున్నది. అందులో భాగమే ఇటీవల కాలంలో దేశ అత్యున్నత న్యాయవ్యవస్థపై మోడీ- ఆయన పరివారం దాడి. తమిళనాడు శాసనసభ ఆమోదం పొందిన పది బిల్లులను ఆ రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి ఆమోదించకుండా తన వద్ద ఉంచుకోవటం సరికాదని, మూడునెల్లలోపు ఏ విషయమైనా తేల్చిచెప్పాలని ఏప్రిల్ సుప్రీంకోర్టు సంచలన తీర్పునిచ్చింది, ఆ బిల్లులను ఆమో దించింది. 415 పేజీల తీర్పులో సమైక్య స్వభావం గల రాజ్యాంగ వ్యవస్థలో రాష్ట్రాలు పంపే బిల్లులను రాష్ట్రపతి, గవర్నర్లు గరిష్టంగా మూడు నెలల్లోపు ఆమోదించ టమో లేదా తిప్పి పంపిచడమో చేయాలని, అయితే వెనక్కి పంపితే తగిన కారణాలు కూడా చెప్పాలని పేర్కొంది. అంతే కాక గవర్నర్ల వ్యవహార శైలిపై రాష్ట్రాలు సుప్రీంకోర్టును ఆశ్రయించ వచ్చని రాష్ట్రాలకు స్పష్టం చేసింది. వాస్తవానికి దేశ సర్వోన్నత న్యాయస్థానం రాజ్యాంగం సమైక్య స్వభావాన్ని , రాష్ట్రాల హక్కులను పరిరక్షిస్తూ తీర్పు ఇచ్చింది. గవర్నర్ చేసిన తప్పులను సరిచేసింది. గవర్నర్లు రాజ్యాంగ సహకార సమైక్య వ్యవస్థను పరిరక్షిస్తూ, రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా పనిచేయాలి అలాకాకుండా మొదటి నుండి కేంద్రం చేతుల్లో కీలుబొమ్మగా మారి రాష్ట్రాల్లో వేరే ప్రభుత్వాలు ఉన్నప్పుడు కేంద్రం ఆదేశాలకు అనుగుణంగా, రాజ్యాంగ విరుద్ధంగా ప్రజాస్వామ్య బద్దంగా ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేయకుండా అడుగడుగునా అడ్డుకోవడం చేస్తున్నారు. 1967 తర్వాత అనేక రాష్ట్రాల్లో ప్రతిపక్షాలు అధికారంలోకి రావడంతో కేంద్ర రాష్ట్రాల మధ్య అధికారాలు, వనరుల మధ్య తరచూ వివాదాలు తలెత్తాయి. ముఖ్యంగా 1983 తర్వాత అనేక రాష్ట్రాల్లో కాంగ్రెసేతర ప్రభుత్వాలు ఏర్పడడంతో వివాదాలు మరింత ముదిరాయి. దీంతో కేంద్ర రాష్ట్ర సంబంధాలు పరిశీలించి, మంచి సలహాలు, సమ న్వయం కోసం 1970లో తమిళనాడు ప్రభుత్వం రాజమన్నార్ కమిషన్ వేసింది. 1973లో పంజాబ్‌లో అకాలీదళ్ ప్రభుత్వం 1973లో ఆనందపుర సాహెబ్ తీర్మానం చేసింది. ఇందిరాగాంధీ 1983లో సర్కారియా కమిషన్, తర్వాత వాజ్‌పేయి పూంచ్ కమిషన్లు వేశారు. ఈ కమిషన్లు కేంద్ర రాష్ట్రాల మధ్య అధికారాలు, ఆదాయ వనరుల పంపిణీపై మంచి సలహాలు, సూచనలిచ్చాయి. కానీ ఇవన్నీ బుట్ట దాఖలయ్యాయి. రాష్ట్రాల్లో గవర్నర్ల మితిమీరిన జోక్యం ఎక్కువైంది. రాష్ట్రపతి పాలన విధించే నిబంధన 356 దుర్వినియోగమైంది. ఉమ్మడి ఏపీలో అప్పటి గవర్నర్ రామ్‌లాల్ ప్రజాస్వామికంగా ఎన్నికైన ఎన్టీ రామారావు ప్రభుత్వాన్ని రద్దుచేసి, నాదెండ్ల భాస్కరరావును ముఖ్యమంత్రిగా నియ మించారు. అలాగే 1994లో కర్నాటకలో బొమ్మరు ప్రభు త్వాన్ని గవర్నర్ సిఫార్సులతో రాష్ట్రపతి పాలన విధించారు. ఈ పరిణామాలను న్యాయస్థానాలు ఆక్షేపించాయి. గవర్నర్లు రాజ్యాంగబద్ధ అధికారాలను అపహస్యం చేయరాదని ,రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా రాజ్యాంగ ప్రజాస్వామిక విలువలు కాపా డాలని హితవు పలికాయి.

ఇక ప్రస్తుత విషయానికొస్తే తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి బిల్లులు అట్టిపెట్టుకోవడంపై కోర్టు తీర్పు వెలువడగానే ఉప రాష్ట్రపతి ధన్కర్ "న్యాయవ్యవస్థ కంటే చట్టసభలే ఎక్కువ అని, రాష్ట్రపతి నిర్ణయాలను కోర్టులు అక్షేపించటం సరికాదని" సుప్రీం కోర్టు తీర్పుపై ధ్వజమెత్తారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్మునిబంధన 142 ప్రకారం పద్నాలుగు అంశాలతో సర్వోన్నత న్యాయస్థానాన్ని ప్రశ్నించారు. ఇదంతా కేంద్రంలోని బీజేపీ సర్కార్ కనుసన్నల్లోనే జరిగిందనేది వాస్తవం! మోడీ అధికారంలోకి వచ్చినప్పటి నుండి ప్రజాస్వామ్య మూలస్తంభాలైన చట్టసభలు, కార్యనిర్వాహకవర్గం, చివరకు న్యాయ వ్యవస్థను కూడా తమ గుప్పెట్లో పెట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. రాష్ట్రపతి ద్వారా సుప్రీంకోర్టుకే సవాల్ విసరటం, సర్వోన్నత న్యాయస్థానం నిర్ణయాలను ప్రశ్నించడం ముమ్మాటికి సరైనది కాదు. రాష్ట్రపతి ప్రశ్నలపై పరోక్షంగనైనా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవారు స్పందించారు. "మన ప్రజాస్వామ్య దేశంలో ఏ వ్యవస్థ గొప్పది కాదని%ా% భారత రాజ్యాంగం మాత్రమే సర్వోన్నతమైనదని, ప్రజాస్వామ్యంలో కీలక స్తంభాలైన శాసన, కార్యనిర్వాహక ,న్యాయ వ్యవస్థలు మూడు సమానమే"నని అన్నారు. ఈమూడు పరస్పరం గౌరవించు కోవాలని స్పష్టం చేశారు. చట్టాలు చేసే అధికారం పార్లమెంటుకు ఉందని అయితే అవి రాజ్యాంగ పరిధిలో ఉండాలని, రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని మార్చే అధికారం పార్లమెంటుకు లేదని, రాజ్యాంగమే అత్యున్నతమైనదని తేల్చిచెప్పారు. ఈ విషయం 1973లో కేశవనంద భారతి కేసులో పదమూడు మంది సుప్రీం కోర్టు న్యాయమూర్తుల విస్తృత ధర్మాసనం కూడా ఇదే స్పష్టం చేసింది. ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా కూడా పలు వేది కలపై ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ న్యాయమూర్తుల మాటలు ప్రజాస్వామ్యంపై ప్రజలకు నమ్మకం సడలకుండా చేశాయనడంలో సందేహం లేదు.

ఇక రాష్ట్రపతి లేవనెత్తిన ప్రశ్నలకు న్యాయమూర్తులు తీర్పులోనే సమాధానమిచ్చారు. 2016లో రాష్ట్రపతికి బిల్లుల ఆమోదంపై మూడు నెలల కాల పరిమితి విధిస్తూ హెూం వ్యవ హారాల శాఖ జారీ చేసిన మార్గదర్శకాల మేరకు ( మెమోరాండం) అసెంబ్లీలో ఆమోదించిన బిల్లులు రాష్ట్రపతి మూడు నెలల్లోగా ఆమోదించాలనే గడువు ప్రకారం తీర్పు ఇచ్చినట్లు పేర్కొన్నారు. అలాగే ఈ తీర్పు భారత రాజ్యాంగాన్ని, సమైక్య స్ఫూర్తిని , రాష్ట్ర ప్రభుత్వాల హక్కులను కాపాడిందని, ఇది ఎంతో ఆదర్శవంతమైన తీర్పు అని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ తిరుపతిలో ఇటీవల పాల్గొన్న ఓ కార్యక్రమంలో ప్రశంసించారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును కాదని న్యాయవ్యవస్థ పైనే రాష్ట్రపతి ప్రశ్నలు సంధిస్తున్న పరిస్థితులు నేడు దేశంలో ఉన్నాయని ఆయన బాధపడ్డారు. రూపంలో ఆది నుండి భారతదేశం ప్రజాస్వామికం కానీ, సారంలో నియంతృత్వంగా ఉంది. మరి ముఖ్యంగా బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటినుండి రాజ్యాంగంపైనే దాడి మొదలు పట్టింది. ఈ పార్టీ మాతృ సంస్థ ఆరెస్సెస్ రాజ్యాంగాన్ని అంగీకరించదు. సనాతన ధర్మం, మనస్మృతి వీరికి శిరోధార్యం. రాజ్యాంగ ఆశయాలు, విలువలకు కాషాయ నేతలు కట్టుబడరు. మన రాజ్యాంగ ఆశయాలు, విలువలు ప్రజలకు అందకపోతే ప్రజలు తిరుగుబాటు చేస్తారని బాబాసాహెబ్ అంబేద్కర్ ఆనాడే ప్రకటించారు."1950 జనవరి 26 మనం వైరుధ్యాల్లోకి ప్రవేశిస్తున్నాం. రాజకీయాల్లో సమానత్వం కానీ సామాజిక, ఆర్థిక రంగాల్లో అసమానత్వం ఉన్నాయి. ఈ వైరుధ్యాన్ని మనం పరిష్కరించకపోతే అసమానత్వంతో బాధ పడుతున్న ప్రజలు ఈవ్యవస్థలను బద్దలు కొడతారు" అని అన్నారు. ఏమైనా బలమైన సామాజిక ఉద్యమాల ద్వారానే రాజ్యాంగ ఆశయాలు, విలువలు, హక్కులు రక్షించబడతాయి.

# అది నిరూపించు రాజీనామా చేస్తా

**వేద న్యూస్, కడప :**

మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి మంత్రి నారా లోకేష్ సవాల్ విసిరారు. యూఆర్ఎస్ఏ కంపెనీకి ఎకరానికి 99 రూపాయలకు ఇచ్చామని నిరూపిస్తే తన మంత్రి పదవికి రాజీనామా చేస్తానంటూ ఛాలెంజ్ చేశారు. మంగళవారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మంత్రి మాట్లాడుతూ.. టీసీఎస్‌కు 99 పైసలకు ఇచ్చామని.. టాప్ 100 ఐటీ కంపెనీల్లో ఎవరు వచ్చినా ఇలానే ఇస్తామని అన్నారు. జగన్ తీరు దొంగే దొంగ అన్నట్టు ఉందని వ్యాఖ్యలు చేశారు. జగన్ హయాంలో పరిశ్రమలను తరిమేశారని మండిపడ్డారు. లిక్కర్ కేసులో దర్యాప్తు పారదర్శకంగా సాగుతోందని మంత్రి అన్నారు. సీఎం పదవి పోయాక కూడా జగన్ అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు.

రాబోయే ఐదు దశాబ్దాలు పార్టీ భవిష్యత్ బాగుండాలని.. అందుకనే సంస్థాగత నిర్మాణంపై దృష్టి పెట్టామని అన్నారు. లోకేష్ పార్టీలో ఒక భాగమే అని... ఆయనే పార్టీ కాదని అన్నారు. పార్టీ ఏ బాధ్యత అప్పగించినా చేస్తానని.. పార్టీ కార్యకర్తలు ఏ పదవి అడిగినా ఇస్తామని అన్నారు. సీనియర్లు, జూనియర్లు కలిసి పని చేయాలని.. అప్పుడే పార్టీ ముందుకు వెళ్తుందని చెప్పుకొచ్చారు. కార్యకర్తల్లో కసి ఉందని... బాగా ఆక్టివ్‌గా ఉన్నారన్నారు. అధికారంలో ఉన్నామని.. అధికారంలోకి వచ్చాక అహం ఉండకూడదని అన్నారు. ఒక వర్కింగ్ గ్రూప్‌ను ఏర్పాటు చేస్తామని.. మండల స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు ఈ గ్రూప్ ఉంటుందని తెలిపారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి భేటీ అవుతారన్నారు. ఇందులో కార్యకర్తల సాధక బాధలు తెలుసుకుంటారని చెప్పారు. పార్టీలో ఎప్పుడు చర్చ అనేది ఉండాలని.. అప్పుడే పార్టీ వైబ్రెంట్‌గా ఉంటుందని అన్నారు.




గడిచిన 11 నెలల్లో అన్ని ప్రాంతాలకు ప్రాజెక్ట్‌లు వచ్చాయన్నారు. రాయలసీమలో రెన్యువల్ పవర్‌ను తీసుకొచ్చామని తెలిపారు. పార్టీ కార్యకర్తలు అందరికి ఒకేసారి న్యాయం చేయలేమని.. కానీ పార్టీ కోసం పని చేసిన చాలా మందికి పదవులు ఇచ్చామన్నారు.

# పాక్ ఆర్మీ పోస్టులపై విరుచుకుపడిన భారత బలగాలు

**వేద న్యూస్, న్యూఢిల్లీ :**




జమ్మూ: 'ఆపరేషన్ సిందూర్'లో భాగంగా పాకిస్థాన్ భూభాగంలోకి భారత బలగాలు చొచ్చుకెళ్లి ఉగ్రవాద శిబిరాలపై ఏవిధంగా విరుచుకుపడ్డాయో వివరించే కొత్త వీడియోను సరిహద్దు భద్రతా దళం విడుదల చేసింది. మంగళవారంనాడిక్కడ జమ్మూ బీఎస్ఎఫ్ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈ వీడియోను అధికారులు విడుదల చేశారు. సాయుధ బలగాలు పాకిస్థాన్‌లోని 2.2 కిలోమీటర్ల లోపలకు చొచ్చుకుపోయి ఉగ్రవాద శిబిరాలపై విరుచుకుపడటం, అత్యంత శక్తివంతంగా ఈ దాడులు జరగడంతో పాకిస్థాన్ రేంజర్లు కకావికలై పరుగులు తీయడం ఈ వీడియోలో కనిపిస్తోంది. ఉగ్రవాద స్థావరాలను నేలమట్టం చేయడంతో పాటు సరిహద్దుల వెంబడి పాకిస్థాన్ ఆర్మీ పోస్టులను విధ్వంసం చేయడం కూడా వీడియోలో ఉంది.

**- పక్కా ప్లాన్‌తోనే..**

పాకిస్థాన్ క్రాస్-బోర్డర్ షెల్లింగ్‌ను సమర్థవంతంగా తాము తిప్పికొట్టినట్టు బీఎస్ఎస్ అధికారులు తెలిపారు. మే 9,10 తేదీల్లో కూడా ఎల్ఓసీ వెంబడి ఉగ్రస్థావరాలపై దాడులకు ప్లాన్ చేశామని జమ్మూ ఫ్రాంటియర్ బీఎస్ఎఫ్ ఐజీ శశాంక్ ఆనంద్ తెలిపారు. పాకిస్థాన్ క్రాస్ బోర్డర్ ఫైరింగ్ జరపడంతో ముందుగానే సన్నద్ధంగా ఉన్న తమ బలగాలు అనేక పాక్ పోస్టులపై విరుచుకుపడి భారీగా నష్టపరిచాయని, ఈ దాడుల్లో తమకెలాంటి నష్టం జరగలేదని చెప్పారు. ఆపరేషన్‌లో భాగంగా ఎల్ఓసీ సమీపంలోని లూనిలో లష్కరే తొయిబా ఉగ్రవాద శిబిరంపై మే 9-10వ తేదీల మధ్య రాత్రి పక్కా ప్లాన్‌తో దాడిచేశామని, ఈ ఉగ్రవాద శిబరం అంతర్జాతీయ సరిహద్దు నుంచి పాకిస్థాన్‌కు 3 కిలోమీటర్ల దూరంలో ఉందని వివరించారు. ఏప్రిల్ 22న పహల్గాంలో 26 మంది టూరిస్టులను పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు కాల్చిచంపడంతో భారత్-పాక్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు తలెత్తాయి. ఇందుకు ప్రతిగా భారత బలగాలు ఆపరేషన్ సిందూర్ పేరుతో మే 7న పాక్, పీఓకేలోని 9 ఉగ్రవాద స్థావరాలపై మెరుపుదాడులు జరిపాయి. జైషే మహమ్మద్, లష్కరే తొయిబా, హిజ్బుల్ ముజాహిదీన్‌కు చెందిన 100కు పైగా ఉగ్రవాదులను మట్టుబెట్టారు. దీంతో ఎల్ఓసీ వెంబడి పాక్ కాల్పులకు తెగబడింది. కౌంటర్ ఆపరేషన్‌గా భారత్ పెద్దఎత్తున విరుచుకుపడి రాడార్ సిస్టమ్‌లు, కమ్యూనికేషన్ హబ్‌లు, 11 పాక్ ఎయిర్‌బేస్‌లకు చెందిన ఎయిర్‌ఫీల్డ్‌లను ధ్వంసం చేసింది. దీంతో బెంబేలెత్తిన పాక్ కాల్పుల విరమణ ప్రతిపాదనతో ముందుకు రావడంతో భారత్ అందుకు అంగీకారం తెలిపింది.

# హక్కుల కోసం సంఘటితంగా పోరాటాలు

**వేద న్యూస్, డెస్క్:**

దేశవ్యాప్తంగా విద్యా సంస్థల్లో మతం ప్రాతిపదికన విద్యార్థులను చీలుస్తున్నారని భారత విద్యార్థి సమాఖ్య (ఎస్ఎఫ్ఐ) ప్రధాన కార్యదర్శి మయూఖ్ బిశ్వాస్ ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్ఎఫ్ఐ అండమాన్ నికొబార్ దీవుల రాష్ట్ర సదస్సు ఆదివారం ఇక్కడి షాహీద్ భవన్‌లో జరిగింది. సదస్సును ప్రారంభిస్తూ మయూఖ్ ప్రసంగించారు. అండమాన్, నికొబార్ దీవుల్లోని కాలేజీలు ఇప్పటివరకు పుదుచ్చేరి యూనివర్శిటీకి అనుబంధంగా వున్నాయని, ఇప్పుడు దాన్ని రద్దు చేసి కొత్తగా ఏర్పాటు చేసిన డీమ్డ్ యూనివర్సిటీకి అఫిలియేట్ చేశారని విమర్శించారు. అండమాన్ దీవుల్లోని విద్యార్థులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని, వాటి పరిష్కారానికై, విద్యార్థుల చట్టబద్ధమైన హక్కుల కోసం ఆందోళనలు, పోరాటాలు నిర్వహించాలని పిలుపిచ్చారు. ఇందుకోసం విద్యార్థులందరినీ సంఘటితం చేయాల్సిందిగా అండమాన్, నికొబార్ దీవుల ఎస్ఎఫ్ఐ కమిటీని బిశ్వాస్ కోరారు. అందరికీ విద్య, అందరికీ ఉపాధి అన్నది ఎస్ఎఫ్ఐ నినాదమంటూ సంస్థ లక్ష్యాలు, ఉద్దేశాలను వివరించారు. రాష్ట్ర నిర్వాహక కమిటీ కన్వీనర్ అబ్దుల్ వారిష్ ప్రసంగిస్తూ దీవుల్లోని విద్యార్థుల డిమాండ్లను వివరించారు. రాబోయే రోజుల్లో ఎస్ఎఫ్ఐ ఒక శక్తిగా అవతరిస్తుందని అన్నారు. జెఎన్ఆర్ఎం పూర్వ విద్యార్థుల సమాఖ్య చైర్మెన్ డి.అయ్యప్పన్, దీవుల డీవైఎఫ్ఐ కార్యదర్శి డిజోలు కూడా సదస్సులో విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. దీవుల్లోని వివిధ విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో సదస్సుకు హాజరయ్యారు. విద్యార్థులకు సంబంధించిన పలు అంశాలపై సదస్సు అనేక తీర్మానాలను ఆమోదించింది.


# గాజాపై ఇజ్రాయిల్ దాడులు



**వేద న్యూస్, న్యూఢిల్లీ :**

పాలస్తీనీయులపై ఇజ్రాయిల్ పాశవిక దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. సోమవారం తెల్లవారుజామున ఇజ్రాయిల్ సైన్యం చేసిన దాడుల్లో 52 మంది మరణించారు. వీరిలో 36 మంది పునరావాస శిబిరంలో తలదాచుకుంటున్న వారే. నిద్రలో ఉండగానే వీరంతా ఇజ్రాయిల్ దాడుల్లో కన్నుమూశారు. గాజా నగరంలో దరాజ్‌లోని పాఠశాలపై జరిగిన దాడిలో పదుల సంఖ్యలో ప్రజలు గాయపడ్డారని అధికారులు తెలిపారు. ఈ ఏడాది మార్చి నుంచి ఇజ్రాయిల్ తన దాడులను మరింత ఉధృతం చేసిన సంగతి తెలిసిందే. అలాగే దాదాపు 3 మూడు నెలలుగా గాజాలోకి ఆహారం, మందులు, ఇంధనం.. వంటి అనేక ఇతర వస్తువులు ప్రవేశించకుండా అడ్డుకున్న ఇజ్రాయిల్ ఇటీవలే వాటి రవాణాకు అనుమతించింది. అంతర్జాతీయ సంస్థలు, సహాయ బృందాలు గాజాలో కరువు గురించి హెచ్చరించడంతో ఇజ్రాయిల్ తప్పనిసరిగా ఈ నిర్ణయం తీసుకుంది. అయితే గాజాలోకి వస్తున్న ఈ సహాయం ఇక్కడి అవసరాలకు సరిపోదని సంస్థలు చెబుతున్నాయి. కాగా, గాజాను పూర్తిగా స్వాధీనం చేసుకుని, ఇక్కడ ఉన్న 2 మిలియన్లకు పైగా ప్రజల్ని బలవంతంగా వలస వెళ్లేవిధంగా చేసే ఉద్దేశంతోనే ఇజ్రాయిల్ దాడులను కొనసాగిస్తుంది. ఇప్పటికే గాజాలోని అనేక ప్రాంతాలను ఇజ్రాయిల్ నాశనం చేసింది. దాదాపు 90 శాతం ప్రజలు నిరాశ్రయులయ్యారు. ఇజ్రాయిల్ దాడుల్లో ఇప్పటి వరకూ 54వేల మంది పాలస్తీనీయులు మరణించారు.

# సరిహద్దు దాటి పెళ్లిళ్లు చేసుకుంటే చట్టపరమైన చిక్కులు తప్పవు



**వేద న్యూస్, డెస్క్:**

బాగ్లాదేశ్‌లోని చైనా రాయబార కార్యాలయం తమ దేశ పౌరులకు కీలక సూచనలు జారీ చేసింది. అక్రమ పద్ధతుల్లో సరిహద్దులు దాటి వివాహాలు చేసుకోవద్దని, ఆన్‌లైన్ వేదికగా జరిగే పెళ్లిళ్ల మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. ఈ మేరకు చైనా ప్రభుత్వ నియంత్రణలోని గ్లోబల్ టైమ్స్ పత్రిక ఈ విషయాన్ని వెల్లడించింది. "సరిహద్దు డేటింగ్" వంటి మోసపూరిత ప్రకటనలను నమ్మవద్దని ఎంబసీ సూచించింది. అనధికారిక మార్గాల్లో లేదా వాణిజ్య మ్యాచ్‌మేకింగ్ ఏజెన్సీల ద్వారా "విదేశీ వధువులను" వెతకడం చైనా చట్టాల ప్రకారం నిషేధమని గుర్తుచేసింది. "విదేశీ వధువును కొనడం" అనే ఆలోచనను పూర్తిగా విడనాడాలని, బంగ్లాదేశ్‌లో వివాహం చేసుకునే ముందు అన్ని విషయాలను క్షుణ్ణంగా పరిశీలించాలని చైనా పౌరులను కోరింది. చైనాలో ఒకప్పుడు అమలులో ఉన్న ఒకే బిడ్డ విధానం, సాంస్కృతికంగా కొడుకులకే ప్రాధాన్యత ఇవ్వడం వంటి కారణాలతో ప్రస్తుతం లింగ అసమానత నెలకొంది. దీనివల్ల సుమారు 30 మిలియన్ల మంది చైనా పురుషులకు వివాహ వయసు వచ్చినా జీవిత భాగస్వామి దొరకడం లేదు. దీనిని అవకాశంగా మలుచుకున్న కొన్ని నేర ముఠాలు, వివాహం పేరుతో బంగ్లాదేశ్ మహిళలను అక్రమంగా చైనాకు తరలిస్తున్నాయని "ది డైలీ స్టార్" పత్రిక ఇటీవల ఒక కథనంలో పేర్కొంది.



## గంజాయి రవాణాను అడ్డుకున్న పోలీసులు

**వేద న్యూస్, శాయంపేట:**

అక్రమంగా తరలిస్తున్న నిషేధిత గంజాయిని హనుమకొండ జిల్లా శాయంపేట పోలీసులు మంగళవారం పట్టుకున్నారు.సిఐ రంజిత్ రావు తెలిపిన వివరాల ప్రకారం ఎస్ఐ జక్కుల పరమేశ్వర్ పోలీస్ సిబ్బందితో కలిసి మందారిపేట సెంటర్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అక్కడే బస్టాండ్ వద్ద ఒక వ్యక్తి అనుమానస్పదంగా కనిపించగా వెంటనే అతని వద్దకు వెళ్లి విచారించి, తనిఖీ చేశారు. అతని వద్ద ఉన్న బ్యాగ్‌లో 6.085 కేజీ నిషేధిత ఎండు గంజాయి తో పట్టుబడ్డారు. దాని విలువ దాదాపు రూ.3,10,000 నిందితుడి నీ అదుపులోకి తీసుకొని విచారించగా దత్ టెంపుల్ గ్రామం,చంద్రపూర్, మహారాష్ట్ర కు చెందిన సయ్యద్ షారుఖ్, జాకీరుద్దీన్, అహ్మద్ పట్టుబడినట్లు పోలీసులు తెలిపారు. ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఉదేశ్యంతో ఒరిస్సా కి చెందిన జితేంద్ర కుమార్ వ్యక్తి దగ్గర గంజాయిని తక్కువ ధరకి కొని ఎక్కువ ధరకి అమ్ముకొనేవాడు అని సిఐ తెలిపారు. నిందితున్ని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కి పంపగా జితేంద్ర కుమార్ అనే నిందితుడు పరారిలో ఉన్నట్లు తెలిపారు.



## పెద్దమ్మ తల్లి గుడి నిర్మాణానికి విరాళం

**వేద న్యూస్,శాయంపేట:**

శాయంపేట మండలం సాధనపల్లి గ్రామంలోని పెద్దమ్మ తల్లి గుడి నిర్మాణానికి మాజీ జడ్పీటీసీ వంగాల రమాదేవి నారాయణరెడ్డి దంపతులు రూ. 50వేలు విరాళాన్ని అందించారు. అనంతరము వారు మాట్లాడుతూ పెద్దమ్మతల్లి ఆశీస్సులతొ సాదనపల్లి గ్రామం, శాయంపేట మండల ప్రజలు ఎల్లప్పుడు సుఖసంతోషలతో పాడీ,పంటలతో ఆయురారోగ్యలతో వుండాలి అని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఏంపిటిసి షేక్ గౌస్, గ్రామ పెద్దలు, ముదిరాజ్ కుల సంఘము అధ్యక్షులు మిట్టపల్లి తిరుపతి, సాదు శ్రీను, మిట్టపల్లి సదానందం, మిట్టపల్లి శ్రీను, మాజీ సర్పంచ్ కత్తుల సాంబయ్య పాల్గొన్నారు.



## పీసీసీ నియామకాల్లో బీసీలకు ప్రాధాన్యత కల్పించాలి

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**

త్వరలో జరగబోయే పీసీసీ రాష్ట్ర కార్యవర్గంలో బీసీలకు తగిన ప్రాధాన్యం కల్పించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత రాహుల్ గాంధీకి లేఖ రాసినట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభా దామాషా ప్రకారం పార్టీ పదవుల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించి సామాజిక న్యాయం చేయాలని కోరుచున్నామన్నారు.పేరుకే సామాజిక న్యాయం అని చెప్తున్నారు కానీ తెలంగాణ రాష్ట్రంలో సామాజిక న్యాయం అమలు కావడం లేదన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేవలం ఒకే ఒక సామాజిక వర్గానికి ప్రాధాన్యత కల్పిస్తున్నారని ఆయన అన్నారు.మంత్రి పదవుల్లో కూడా బీసీలకు సముచిత స్థానం కల్పించాలని కోరుతున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో బంటు వెంకటేశ్వర్లు,దోనేటి శేఖర్ లు పాల్గొన్నారు.



## టీజేఎఫ్ రజతోత్సవ సభలను విజయవంతం చేద్దాం

**వేద న్యూస్,వరంగల్ టౌన్:**

ఈ నెల 31న హైదరాబాద్‌లో నిర్వహించే టీజేఎఫ్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని వరంగల్ జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు మిట్ట నవనీత్, కార్యదర్శి నిలం శివ అన్నారు. మంగళవారం తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (హెచ్-143) రాష్ట్ర ఉపాధ్యక్షులు బిఆర్ లెనిన్ ఆదేశాలనుసారం వరంగల్ జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు మిట్ట నవనీత్, కార్యదర్శి నిలం శివ ఆధ్వర్యంలో రోడ్డు ట్రాన్స్పోర్ట్ అధికారి శోభన్, వరంగల్ ఎమ్మార్వో ఇక్బాల్, టీజేఎఫ్ శ్రేణులతో కలిసి పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..అల్లం నారాయణ నాయకత్వంలో తెలంగాణ జర్నలిస్టుల ఫోరం 25వ రజతోత్సవ సభను హైదరాబాద్ జలవిహార్ ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు టీజేఎఫ్ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు లు బండి రవి, వెలిషాల పూర్ణ చందర్, ఉపాధ్యక్షులు అమీర్, కార్యవర్గ సభ్యులు హరినాథ్, బందేల కృష్ణ ,రాజేష్ ,భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

# పండుగ వాతావరణంలో అవతరణ దినోత్సవం

**వేద న్యూస్, సూర్యాపేట ప్రత్యేక ప్రతినిధి:**




తెలంగాణ అవతరణ దినోత్సవం పండుగ వాతావరణంలో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ పవార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ నరసింహ, అదనపు కలెక్టర్ పి రాంబాబులతో కలిసి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవర్ అధికారులతో రాష్ట్ర అవతరణ దినోత్సవం పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శాఖల వారీగా చేసిన సంక్షేమ పథకాలు, లబ్ధిదారులు వివరాలు 29వ తారీకు లోపు సిపిఓ కి అందజేయాలని సూచించారు.ప్రముఖులకు ఆహ్వానం, ప్రోటోకాల్, సీట్టింగ్ అరేంజ్మెంట్, స్వతంత్ర సమరయోధులకి సన్మానం లాంటి వాటిల్లో ఎలాంటి తప్పులు దొర్లకుండా జాగ్రత్తగా చూసుకోవాలని తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలు దేశ భక్తికి, తెలంగాణ రాష్ట్రానికి సంబంధించినవిగా ఉండేలా చూసుకోవాలని పేర్కొన్నారు. డ్రింకింగ్ వాటర్ సూర్యాపేట మున్సిపాలిటీ వారు ఏర్పాటు చేయాలని తెలిపారు. వేడుకలు జరిగే చోట హెల్త్ అండ్ మెడికల్ డిపార్ట్మెంట్ వారు మెడికల్ క్యాంపు కంప్లైంట్స్, అంబులెన్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. రాజీవ్ యువ వికాసం, ఇందిరా మహిళా శక్తి,ఇందిరమ్మ ఇండ్లు లాంటి పథకాలకు సంబంధించిన ఉత్తర్వులు లబ్ధిదారులకు జూన్ రెండో తారీఖున అందజేసేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అధికారులకు సూచించారు. కలెక్టరేట్, డివిజన్ కార్యాలయాలు,మండల కార్యాలయాలు, గ్రామ పంచాయతీలు లాంటి ప్రభుత్వ కార్యాలయాల్లో రాష్ట్ర అవతరణ దినోత్సవం పండుగ వాతావరణంలో జరిపేలా చూడాలని అధికారులకు సూచించారు. స్టాల్స్ లను శాఖల వారీగా ఏర్పాటు చేస్తూ తమ శాఖచే చేసిన కార్యక్రమాలను ఫోటో ఎగ్జిబిషన్ ద్వారా చూపించాలని తెలిపారు. తదుపరి జిల్లా ఎస్పీ నర్సింహ మాట్లాడుతూ వర్షాకాలం కాబట్టి పరేడ్ గ్రౌండ్లో జాగ్రత్తలు తీసుకోవాలని, ఫ్లాగ్ అఫ్ ఆనర్ లకి సంబందించి అన్ని ఏర్పాట్లు చూడాలని అదనపు ఎస్పీ జనార్ధన్ రెడ్డికి సూచించారు.ఈ సమావేశంలో డిఎఫ్ఓ సతీష్ కుమార్, డిఆర్‌డిఓ వివి అప్పారావు, ఆర్డిఓ వేణుమాధవ్ సూర్యాపేట మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, సిపిఓ కిషన్, డిఈఓ అశోక్,డిపిఓ యాదగిరి, డిఐఈఓ భాను నాయక్,సంక్షేమ అధికారులు దయానంద రాణి, శ్రీనివాస్ నాయక్, శంకర్,జగదీశ్వర్ రెడ్డి, పరిపాలనాధికారి సుదర్శన్ రెడ్డి అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గుంతలమయం డాక్టర్స్ కాలనీ..!

- **వచ్చేది వర్షాకాలం సమస్య తీరేదెలా?**

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**



మిర్యాలగూడ పట్టణంలోని డాక్టర్స్ కాలనీ నిత్యం ప్రజలతో రద్దీగా ఉంటుంది.నిత్యం రద్దీగా ఉండే డాక్టర్స్ కాలనీలో మూడు రోడ్లు మొత్తం గుంతల మయంగా మారిపోయింది.మిర్యాలగూడ పట్టణం లోని ఇస్లాంపురం 47వ వార్డు పరిధిలోకి ఈ డాక్టర్స్ కాలనీలోని మూడు వీదులు(బజార్లు) వస్తున్నాయి.వాణిజ్య ప్రదేశమైన మిర్యాలగూడ పట్టణంలోకి నియోజకవర్గం లోని పలు మండలాల నుండి ప్రజలు ఏదో ఒక అనారోగ్యంతో ప్రతిరోజూ వందలమంది డాక్టర్స్ కాలనీ ప్రైవేట్ హాస్పిటల్స్ కి వస్తూ పోతూ ఉంటారు.గతంలో వాహనాలు మొత్తం హాస్పిటల్స్ ముందు పార్కింగ్ చేసేవారు.ప్రజలు అనారోగ్యంతో అంబులెన్స్ లో హాస్పటల్ వీధుల వెంట రావడానికి ఇబ్బందిగా ఉండేది.స్థానిక ఎమ్మెల్యే బిఎల్ఆర్,సబ్ కలెక్టర్ నారా యణ అమిత్ లతోపాటు పట్టణపోలీస్ సిబ్బంది సహకారంతో ట్రాఫిక్‌ను కంట్రోల్ చేసి అంబులెన్స్‌కు దారిని సుగమం చేశారు.రాబోయేది వర్షాకా లం కొద్దిపాటి వర్షానికి డాక్టర్స్ కాలనీలోని గుంతలు,రోడ్లు మొత్తం నిండిపోయే అవకాశం ఉంది. మిర్యాలగూడ అభివృద్ధి ప్రదాతగా పేరొందిన ఎమ్మెల్యే బిఎల్ఆర్ చొరవ తీసుకొని డాక్టర్ కాలనీలోని ప్రధాన మూడు వీధులలోని రోడ్లు వేయించి రోగులకు కలిగే అసౌకర్యం నుంచి గట్టెక్కించాలని కాలనీవాసులు,పలువురు అనారోగ్య బాధితులు కోరుతున్నారు.

# విత్తనాలు అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు

- **కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**వేద న్యూస్, వరంగల్ జిల్లా :**



విత్తనాలను అధిక ధరలకు అమ్మితే ఫర్టిలైజర్ షాపుల యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద హెచ్చరించారు. మంగళవారం నర్సంపేట పట్టణంలోని పరమేశ్వర విత్తన విక్రయ దుకాణం, ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలను కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆకస్మికంగా తనిఖీ చేసి స్టాక్ రిజిస్టర్, రసీదు పుస్తకాలు, ధరల పట్టిక, తూకం యంత్రం, విత్తన ప్యాకెట్లను పరిశీలించారు. గీసుగొండలో మండల కేంద్రంలోని రాశి సీడ్స్ కంపెనీ గోడౌన్ ను తనిఖీ చేసి గోడౌన్ స్టోరేజ్ పాయింట్ నుండి ఉమ్మడి వరంగల్, ఖమ్మం, కరీంనగర్ జిల్లాలకు పంపిణీ ప్రక్రియ ను స్టాక్, రసీదులు,బిల్లులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం గుర్తించిన నాణ్యమైన విత్తనాలను మాత్రమే రైతులకు అమ్మాలని, సంబంధిత కంపెనీ పేరుతో రసీదు తప్పనిసరిగా రైతులకు అందించాలని ఆదేశించారు. కల్తీ, నాణ్యత లేని విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని అన్నారు. జిల్లావ్యాప్తంగా నకిలీ విత్తనాలను అరికట్టేందుకు పోలీసు, వ్యవసాయ అధికారులతో టాస్క్ ఫోర్స్ టీంలను నియమించి నిత్యం విత్తనాల దుకాణాలపై నిఘా పెట్టి తరచుగా తనిఖీలు నిర్వహిస్తున్నారని కలెక్టర్ తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించి ఎక్కువ ధరలకు అమ్మితే షాపు లైసెన్స్ రద్దుచేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. దుకాణంలో నిల్వల వివరాలను ప్రతిరోజు వ్యవసాయ శాఖ అధికారులకు అందించాలని సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, ఏడీఏ దామోదర్, వ్యవసాయ అధికారి కృష్ణ తదితరులు ఉన్నారు.

# చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

- **చట్టాన్ని ఉల్లంఘిస్తూ భౌతిక దాడులకు పాల్పడితే జైలు శిక్ష తప్పదు**
- **రైతులు జాగ్రత్తగా, అప్రమత్తంగా ఉండాలి**
- **జిల్లా ఎస్పీ కే. నరసింహా**

**వేద న్యూస్, సూర్యాపేట ప్రత్యేక ప్రతినిధి :**



వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో రైతులు వ్యవసాయ పనులు మొదలు పెడుతున్నారు. ఈ క్రమంలో వ్యవసాయ భూమి హద్దులు, దారి, విస్తీర్ణం, నీటివనరులు లాంటి సమస్యలతో రైతులు ఇబ్బందులు పడుతారు. చాలా సందర్భాల్లో ఇవి తీవ్ర సమస్యలు అవుతున్నాయి. చాలా ఫిర్యాదులు నమోదౌతున్నాయి. ఈ క్రమంలో రైతులు చాలా జాగ్రత్తగా వ్యవహరించాలని పరస్పరం భౌతిక దాడులకు పూనుకోవద్దని సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ రైతులకు విజ్ఞప్తి చేశారు. ఇలాంటి సమస్యలు వచ్చినప్పుడు రైతులు సామరస్య ధోరణితో ముందుకెళ్లాలని అన్నారు. సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించుకోవడానికి పెద్ద మనుషుల సమక్షంలో సున్నితంగా సమస్యలను పరిశీలించుకోవాలని అన్నారు.ఇలాంటి సమస్యలు వచ్చినప్పుడు అధికారులను ఆశ్రయించాలి, సర్వేల ద్వారా ముందుకు వెళ్లాలని కోరారు. తీవ్రమైన సమస్యల్లో ఉన్న భూముల పైకి కోర్టు ఉత్తర్వులు లేకుండా ఎవరు కూడా వెళ్ళవద్దన్నారు. భూమిపై సేద్యంలో ఉన్న ఇతరులను ఇబ్బందులు పెట్టవద్దన్నారు. పంటలు నష్టం చేయడం, హద్దులు చెరపడం లాంటి క్రిమినల్ చర్యలకు పునుకోవద్దని హెచ్చరించారు. చట్టాన్ని ఉల్లంఘిస్తూ ఒకరికొకరు భౌతిక దాడులకు దిగడం వివాదాలు పెట్టుకోవడం వల్ల శాంతిభద్రతల సమస్యలు వస్తాయని తెలిపారు. సివిల్ కోర్టు ఉత్తర్వులైనటువంటి అడ్వకేట్ కమీషన్, బేల్ లిఫ్ కోర్టు ద్వారా పోలీస్ ప్రోటక్షన్ లాంటివి పొందాలని అన్నారు. ఎవరైనా చట్టాన్ని ఉల్లంఘిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. కావున రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

**వేద న్యూస్, హైదరాబాద్ :**



సంక్షోభంలో ఉన్న చేనేత పరిశ్రమ రక్షించుకోవడానికి కార్మికుల సమస్యల పరిష్కారానికి నేతన్నలందరినీ సంఘటిత పరిచి సమైక్య పోరాటాలకు సమాయత్తం చేయాలని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు పిలుపునిచ్చారు. హైదరాబాద్ హిమాయత్ నగర్ లోని రాజ బహదూర్ గౌర్ హాలులో జరిగిన చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సమితి సమావేశానికి చేపూరి ధనుంజయ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకట్రాములు మాట్లాడారు. 11 ఏండ్ల మోడీ పాలనలో నేతన్నల బ్రతుకులు పెనం మీద నుండి పొయ్యి మీద పడ్డచందంగా తయారైనదన్నారు. చేనేత ఎడల ఏమాత్రం చిత్తశుద్ధియున్న జిఎస్టిని తక్షణమే రద్దు చేయాలన్నారు. నేటికీ ప్రత్యక్షంగా పరోక్షంగా కొట్లాదిమంది చేనేతపై ఆధారపడి జీవిస్తు న్నారని,తగిన విధంగా నిదులు కేటాయించి కార్మికులకు పని కల్పించి గిట్టుబాటు కూలీ లభించేలా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మీనరసయ్య ప్రసంగిస్తూ ఎన్నికల ముందు చేసిన వాగ్దానాలను ప్రభుత్వం తక్షణమే అమలుపరచాలని అన్నారు.



## చదువు...

చదువుకునుటకు ఆసక్తి, జ్ఞాపకశక్తి చాలు
కార్పొరేట్ స్కూళ్ళల్లో ర్యాంకులు విజ్ఞానానికి
కొలమానం కాదని గుర్తించండి ..!
విద్యార్థులలో ప్రతిభను వెలుగులోకి
తెచ్చే విధానం కావాలి అని గుర్తించండి..!
చదువుకొనకండి కార్పొరేట్ స్కూళ్ళల్లో
చదువుకొండి ప్రభుత్వ స్కూళ్ళల్లో..!

కార్పొరేట్ స్కూళ్లు పూట పూటకు
పరీక్షలు పెట్టి
విద్యార్థులను యంత్రాల్లా తయారు చేస్తూ...
చదువాలి అన్న ఆసక్తి
లేకుండా చేస్తున్నాయి..!
సమయస్ఫూర్తిలేని చదువులు మనకెందుకు
చదువుకొనకండి కార్పొరేట్ స్కూళ్ళల్లో
చదువుకొండి ప్రభుత్వ స్కూళ్ళల్లో..!

కార్పొరేట్ స్కూళ్లు బండెడు
హోమ్ వర్క్ ఇచ్చి
చిన్నారుల చిట్టి మెదడుకు
నిద్ర లేకుండా చేస్తున్నాయి..!
విలువలు నేర్పిన విద్య
చిన్నారులకు కావాలి..!
చదువుకొనకండి కార్పొరేట్ స్కూళ్ళల్లో
చదువుకొండి ప్రభుత్వ స్కూళ్ళల్లో..!

కార్పొరేట్ స్కూళ్లు అధునాతన
బిల్డింగ్స్ చూపిస్తూ
డాంబికత్వం ప్రదర్శిస్తూ అధిక
ఫీజులు వసూలుచేస్తూ
స్పెషల్ క్లాసులు అంటూ
గంటల కొద్దీ పాఠాలు చెప్తూ
పిల్లల ఆరోగ్యాన్ని పాడుచేస్తున్నారు..!
చదువుకొనకండి కార్పొరేట్ స్కూళ్ళల్లో
చదువుకొండి ప్రభుత్వ స్కూళ్ళల్లో..!

కార్పొరేట్ స్కూళ్లు వసూలు
చేసే అధిక ఫీజుల వల్ల
తల్లితండ్రులు అప్పుల ఊబిలో కూరుకుపోయి
పిల్లల భవిష్యత్తు
మద్యలోనే తుంచేస్తున్నారు..!
చదువుకొనకండి కార్పొరేట్ స్కూళ్ళల్లో
చదువుకొండి ప్రభుత్వ స్కూళ్ళల్లో..!

**- మంజుల పత్తిపాటి (కవయిత్రి),**
మాజీ ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ
డైరెక్టర్, యాదాద్రి భువనగిరి జిల్లా,
9347042218.

## ముస్లింలకు మంత్రివర్గంలో చోటు కల్పించాలి

**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి :**



కాంగ్రెస్ పార్టీతోనే ముస్లిం మైనార్టీల సంక్షేమ అభివృద్ధి సాధ్యపడుతుందని ముస్లింల ఓట్లతో అధికారంలో చేపట్టిన కాంగ్రెస్ పార్టీ తెలంగాణ మంత్రివర్గంలో ముస్లింలకు స్థానం కల్పించి ముస్లిం మైనార్టీలపై తనకున్న చిత్తశుద్ధిని చాటుకోవాలని సంచార ముస్లిం సంక్షేమ సంఘం ఉమ్మడి నల్లగొండ జిల్లా కోఆర్డినేటర్ షేక్ మౌలాలి అన్నారు. మంగళవారం మాడ్గుల పల్లి మండల కేంద్రంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టి ఏడాదిన్నర గడిచినప్పటికీ రాష్ట్ర మంత్రి వర్గంలో నేటికీ ముస్లిం సామజిక వర్గానికి స్థానం కల్పించకపోవడం శోచనీయమన్నారు. జిల్లా పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను కలిసి వినతి పత్రాలు ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073